# జస్టిస్ సహాని!

హైకోర్టు ఆవరణ అంతా జనంతో కిటకిటలాడిపోతోంది. పోలీసులూ, ప్రెస్‌వాళ్లూ మామూలుగా ఆ వింతకేసులో పరమ కిరాతకంగా ప్రవర్తించిన దుర్మార్గుడు మహీధర్‌కి ఏం శిక్షపడుతుందో చూడాలి అని ఊళ్లో వున్న మహిళా సంఘాలు మొత్తం ఇలా రకరకాల మనుషులతో ఇసుకవేస్తేరాలనంతగా జనం గుమిగూడిపోయారు.

వీళ్లని పోలీసులు అదుపుచెయ్యలేక సతమతమయి పోతున్నారు. ఆడ పోలీసులు, మగపోలీసులు లాఠీలు ఝుళిపించినా లాభంలేక రెండుమూడు సార్లు గుంపులుగా చేరి అల్లరిచేస్తున్నవారిని బెదరగొట్టడానికి, గాలిలో కాల్పులు కూడా చేశారు.

"భార్యని ముక్కలు ముక్కలుగా కూరలు కోసినట్టు కోసి గోనెసంచిలో పడేసి మూటగట్టి, ఎక్కడికో తిసికెళ్లి పారేసి చేతులు దులుపుకున్న ఆ నరరూప రాక్షసుడికి వెంటనే మరణదండన విధించకపోతే, ఉరి నిషేధింపబడ్డా ఇటువంటి ఘాతుకాలకి ఉరిఅమలు చెయ్యాల్సిందే ప్రత్యేక రీతిలో" అంటూ పట్టుదలతో లాఠీ దెబ్బలను కూడా ఖాతరు చెయ్యకుండా నుంచున్న మహిళలను చూస్తే, వారిలో తోటిస్త్రీకి జరిగిన అన్యాయంపై ఎంతో సానుభూతి, ఆమెని చంపిన ఆ దౌర్భాగ్యుడి మీద ఎంతోకోసంతో దేన్నీ లెఖ్ఖజేసే స్థితిలో లేరు వాళ్లు.

అంతలో జైలునుంచి కోర్టుకి పిస్తోళ్ల మధ్య గట్టి బందోబస్తుతో పోలీసులు మహీధర్‌ని వెంటబెట్టుకురావడంతో, జనంలో మళ్లీ గందరగోళం మొదలయింది. ప్రెస్ వాళ్ల పరుగులు, ఆడవాళ్ళ అరుపులు, పోలీసులు మళ్లీ గాలిలో కాల్పులు చేశారు. దాదాపు రెండు గంటలపాటు వాదనలు జరిగాయి. మహీధర్ వైపు లాయర్‌కీ, చనిపోయిన శమంత లాయర్‌కీ మధ్యన.

"చూడ్డానికి ఎంత అందంగా నాజూగ్గా వున్నాడో! అంత దుర్మార్గపు బుద్దేంటో" అంది ఒకావిడ.

'బాగా చదువుకున్నాట్ట కూడా. లెక్చరర్‌గా పనిచేస్తున్నాట్ట! ఏదో కాలేజీలో.'అయినా సంస్కారంలేని చదువెందుకు?

"కట్నం చాలదన్న కక్షతో అలా చంపాట్ట"

"కాదు. ఉత్త అనుమానపు వెధవట"

రకరకాల వాఖ్యానాలు కోర్టు ఆవరణలో జరుగుతున్నాయి. అంతలోనే ఎవరో మోసుకొచ్చారు జడ్జీగారి తీర్పు గురించి.

"జడ్జీ సహానీ గుజరాత్ హైకోర్టు నుంచి బదిలీ అయివచ్చాట్ట. చాలా పేరు ప్రఖ్యాతులు గల వ్యక్తిట." అన్నాడొకాయన.

"అయితే వీడికి ఉరిశిక్ష తప్పదులే" అంది ఒకావిడ.

అంతలోనే ఒక ప్రెస్ రిపోర్టరు పరుగెత్తుకొచ్చాడు. మిగతా రిపోర్టర్లతో మాట్లాడూతూ, "జడ్జీ సహానీ గారు వింత తీర్పునిచ్చారు" అన్నాడు.

అతని గొంతు విని అందరూ అటుకేసి పరుగెత్తారు. కొందరు గోలచేశారు. ఆ తీర్పేదో మేమందరం వినేలాగా పెద్దగా చెప్పమని.

"అతగాణ్ని ఒక పదేళ్లపాటు ఒక అటాచ్‌డ్ బాత్‌రూం వున్న ఒక గదిలో అన్నీ అమర్చి, అంటే మంచం, పరుపు, బ్లాంకెటూ వగైరా అన్నీ కూడా ఇచ్చి, అతడు చదువుకోవడానికి రోజూ, కావలసినన్ని పుస్తకాలు, గదితలుపులు తియ్యకుండా తలుపు కిందనుంచి లోపలికి తోసి ఇవ్వాలి. అలాగే భోజనం కూడా. అన్నీ - పప్పూ, కూరా, పెరుగూ ఉన్న పళ్లాన్ని తలుపు కింద నుంచి తోసెయ్యాలి లోపలికి. నీళ్లుకూడా! సప్లైచేసే వాళ్లెవరూ ఇతణ్ణి ఎట్టి పరిస్థితిలోనూ చూడకూడదు. ఎవ్వరూ మాట్లాడకూడదు. అసలు అతని కంటికి మనుషులెవ్వరూ కనబడకూడదు. జ్వరానికీ, జలుబుకీ, కడుపునొప్పికీ అలా కావలసిన టాబ్లెట్లు ఒక్కొక్కటి తలుపు కింద నుంచే ఇవ్వాలి. అలా పదేళ్ళు పూర్తయ్యేవరకు."

అందరూ "నాన్‌సెన్స్.. ఇటువంటి తీర్పు ఎక్కడా వినలేదు." అరిచారు.

"ఇది శిక్షా! లేక మహారాజులా గౌరవించడమా?" అరిచారు మరికొందరు.

"జడ్జికి మతిపోయింది కాబోలు! అటాచ్‌డ్ బాత్‌రూంవున్న గది, చక్కటి భోజనం, చదువుకోవడానికి కావలసిన పుస్తకాలూ, సుఖంగా నిద్రపోవడానికి కావలసిన మంచం, పరుపూ - ఇవన్నీ శిక్షేనా" మహిళాలోకం గర్జించింది.

'కసాయివాడిలా పెళ్లాన్ని ముక్కలు ముక్కలుగా కోసి చంపిన పాపాత్ముడికి జస్టిస్ సహానీ ఇటువంటి శిక్ష విధించడంలో ఏదో పక్షపాతం వుంది. మహీధర్ తల్లిదండ్రులు బాగా డబ్బున్నవాళ్లు. జస్టిస్ సహానీకి బాగా ముట్టజెప్పుంటారు.'అన్నారు చాలామంది. "న్యాయం చెయ్యవలసిన ధర్మపీఠంలో కూర్చుని ఇటువంటి అన్యాయాలు చేస్తే, న్యాయం, నీతీ చచ్చిపోక ఏమవుతుంది?'అన్నారు కొందరు.

"న్యాయం ఏనాడో డబ్బున్నవాళ్ల చేతిలో బందీ అయిపోయింది" అన్నారు మరికొందరు.

చాలామంది లాయర్లు ఈ రకమైన తీర్పుని హర్షించలేదు. కొందరు బహిరంగంగానే వ్యతిరేకించారు.

కొందరు జడ్జీలు కూడా మౌనంగా వుండిపోయారు. అయితే జస్టిస్ చౌదరి మాత్రం ఇది శిక్షకానేకాదనీ ఈ రకమైన శిక్షలు మరిన్ని తప్పులు చేయడానికి ప్రజలను పెడదారి పట్టిస్తాయనీ, ప్రతీవాడూ ' ఓ హెన్రీకథలో లాగా ఏదో ఇలాంటి తప్పు చేస్తే హాయిగా పదేళ్లపాటు చక్కటి భోజనం, మంచి గది, కావలసినన్ని పుస్తకాలూ, మంచి పరుపూ మంచం దొరుకుతాయి. 'ఇంటి కంటే గుడి పదిలమనేవారు. అది మన సామెత. ఇప్పుడు ఇంటికంటే జైలు పదిలమంటారు'అన్నాడు.

వెంటనే చాలా మంది "కరెక్ట్" అని అరవడం మొదలెట్టారు. బయటవున్న జనానికీ ఈ వార్త తెలిసిపోయింది.

"జస్టిస్ చౌదరి జిందాబాద్!" జస్టిస్ సహానీ డౌన్ డౌన్.." అనే నినాదాలూ మారుమ్రోగిపోయాయి.

ప్రజలలో ఆందోళన పెరిగిపోయింది. ఒక రకమైన ఉద్రిక్తమైన వాతావరణం ఏర్పడింది. ఆడవాళ్లందరూ కాళీమాతల్లా ఉగ్రులైపోయారు. జస్టిస్ సహానీని తిట్టని వాళ్లులేరు.

శమంత తాలూకు బంధువులూ తల్లిదండ్రులూ అందరూ తమకి అన్యాయం జరిగిపోయిందని శోకాలు మొదలెట్టారు. చుట్టూ సానుభూతి పరులు చేరి, "జస్టిస్ సహానీ రిజైన్ చెయ్యాలి" అంటూ నినాదాలు ప్రారంభించారు.

పోలీసులకి మళ్లీ లాఠీ చార్జీచుయ్యడం, గాలిలోకి కాల్పులు జరపడం తప్పలేదు.

అంతలోనే మరో రిపోర్టర్ కొత్త వార్త పట్టుకొచ్చాడు.

జస్టిస్ సహానీ రిజైన్ చేశాడనీ, అయితే ప్రభుత్వానికి ఒక సవాలు చేశాడనీ! అదేమిటంటే "ఈ ఒక్కసారీ ఈ ఒక్క కేసునీ తను చెప్పినట్టుగా శిక్ష విధించమని ప్రాధేయపడుగూ, శిక్షాకాలం పదేళ్లూ పూర్తయ్యేక మహీధర్‌లో మార్పురాని పక్షాన సంవత్సరానికి అయిదువేల చొప్పున పదిసంవత్సరాలకీ యాభై వేలు తాను మృతురాలి కుటుంబానికి సమర్పిస్తాననీ, వాళ్లు ఈ శిక్షవలన తమకి న్యాయం జరిగిందని సంతోషిస్తే ప్రభుత్వం తనకి ఈ పది సంవత్సరాల జీతం లెక్కకట్టి ఇవ్వాలనీ"

అందరు న్యాయవాదులూ ఏకగ్రీవంగా ఒప్పుకున్నారు ఈ సవాలుని అమలు చెయ్యడానికి!

చాలామంది ఈ పిచ్చి శిక్ష, ఈ పిచ్చి సవాలూ - రెండూ కూడా చిత్రంగా ఉన్నాయనీ జస్టిస్ సహానీకి మతిభ్రమణం కలిగి వుంటుందని అన్నారు.

అయితే తాత్కాలికంగా ప్రభుత్వం మృతురాలి కుటుంబానికి కొంత ధన సహాయం చెయ్యవలసిందిగా జస్టిస్ సహానీ తన హామీపత్రంలో పేర్కొనడంతో, మహిళా సంఘాలు కాస్త చల్లబడ్డాయి!

అయితే ప్రభుత్వం జస్టిస్ సహానీ కోరిన విధంగా పాతికవేలు ఇవ్వడానికి సిద్ధపడలేదు. అందుకుగానూ, తనే ఆ పాతికవేలూ శమంత కుటుంబానికి ఇస్తాననడంతో, ఆశ్చర్యపోయి అందరూ మూగబోయారు. ఈ అయోమయ పరిస్థితిలో ఏం చెయ్యాలో తెలీక, కాస్సేటికి అందరూ ఎవరిళ్లకి వాళ్లు వెళ్లిపోయారు.

మర్నాడు ఈ వింత తీర్పు గురించీ, జస్టిస్ సహానీ రాజీనామా గురించీ పేపర్లన్నీ ఫ్రంట్‌పేజీలో తాటికాయంత అక్షరాలతో రాశాయి. ఏ మూలచూసినా, ఏ ఇంట్లో చూసినా ఈ మాటలే!

ఒక్కొక్కరి వ్యాఖ్యానం ఆగిపోయింది. క్రమేణా అందరూ ఈ కేసు గురించి మర్చిపోయారు. శమంత తల్లితండ్రులు కూడా జస్టిస్ సహానీ ఇచ్చిన పాతికవేలూ తీసుకుని మౌనంగా వుండిపోయారు.

కొన్నాళ్లకి సజ్టిస్ సహానీ ఇండియా వదిలిపెట్టి లండన్ వెళ్లిపోయాడని పేపర్లు మళ్లీ రాశాయి పెద్దపెద్ద అక్షరాలతో! "ఓహో! శిక్షాకాలం పూర్తయ్యే సమయం దగ్గర పడుతోంది కనుక పలాయనం చేశాడు." అన్నారు కొందరు.

"మహీధర్ తల్లి దండ్రులే ఈ ఏర్పాటూచేసుంటారు.

దేశం విడిచి పోవడానికి ఎన్ని లక్షలు ముట్టజెప్పారో" నన్నారు.

మళ్లీ కొన్నాళ్లు జస్టిస్ సహానీ విదేశీ పర్యటన చర్చనీయాంశ మయింది.

కాలం గడిచిపోతోంది. ఈ ప్రవాహంలో ఎన్నెన్నో కొత్త సంఘటనలు! పాత విషయాలు మరిచిపోయేలా చేసే కొత్త కొత్త వార్తలు! సరికొత్త హత్యలు! వినూత్న నద్ధతిలో దోపిడీలు, మానభంగాలు, దౌర్జన్యాలు. జనానికి వీటితోనే సరిపోతోంది. అయితే జస్టిస్ చౌదరి మాత్రం రేపు మహీధర్ శిక్షాకాలం పూర్తవుతుందని, మహీధర్‌ని ఆ గదిలోనుంచి బయటకు తెచ్చి కోర్టులో హాజరుపరుస్తారనీ, జస్టిస్ సహానీ చేసిన ఛాలెంజ్ పరిణామాలు రేపు పూర్తవుతాయనీ, శమంత తాలూకు వాళ్లందరూ కోర్టులో హాజరు కావాలనీ ఒక ప్రకటన పేపర్లలోనూ రేడియో, టి.విలలోనూ చేశాడు.

దాంతో మళ్లీ మర్నాడు కోర్టు ఆవరణ మహీధర్‌ని చూడడానికి క్రిక్కిరిసి పోయింది. ప్రెస్ రిపోర్టర్లూ, ప్రెస్ ఫోటోగ్రాఫర్లూ అందరూ మహీధర్‌ని రూం తాళం తియ్యగానే

చూడాలని కోరడంతో, ప్రభుత్వం కోర్టుకూడా అనుమతి నిచ్చింది. జనం అంతా మహీధర్‌ని ఉంచిన గది దగ్గరే గుంపుగూడారు.

పదేళ్ళ క్రితం నుంచి ఉన్న మహిళా సమాజంవాళ్ళూ, కొత్తగా వెలసిన మహిళా సంఘాల వాళ్ళూ, మీడియావాళ్ళూ అందరూ నేల ఈనినట్టుగా వున్న జనం మధ్య నలిగిపోయారు. పోలీసులకు తప్పలేదు మళ్ళీ లాఠీ చార్జీ, గాలిలోకి కాల్పులూ!

కోర్టు తాలూకు వ్యక్తి ఆ గదికున్న తాళాలు తెరిచాడు. వేనవేల కళ్ళు ఆ గదిని పరికించాయి.

ప్రెస్ ఫోటోగ్రాఫర్లు కనిపించినవల్లా క్లిక్‌చేస్తున్నారు. పేపర్ల వాళ్ళు బిజీగా రాసుకుపోతున్నారు. తలుపు తియ్యగానే భరించలేని దుర్వాసన. గదినిండా చీమలూ, దోమలూ కంచాల మాద కూర్చుని నాట్యంచేస్తున్నాయి. రకరకాల పాదార్థలతో పెట్టిన భోజనం ప్లేట్లు సంవత్సరానికి మూడువందల అరవై అయిదు రోజుల చొప్పున సంవత్సరానికి మూడువలే ఆరువందల యాబః ప్లేట్లు ఒక పూటకి, ఉదయం బ్రేక్‌ఫాస్లూ, మధ్యాహ్నం భోజనం, సాయంత్రంభోజనం అంటే రోజుకి మూడుసార్లు, చొప్పున పదివేల తొమ్మిది వంద యాభై ప్లేట్లు. అంటే పదేళ్లకే ఇంటూ పది. అంటే ఒకలక్షా తొమ్మిదివేల అయిదువందల ప్లేట్లు. ఎవరికీ తొందరగా లెక్కపెట్టడానికి కూడా వీలులేనన్ని ప్లేట్లు.! అయితే అందులో ఖాళీగా ఉన్న ప్లేట్లు వెయ్యో, రెండువేలో తేలాయి. మిగతావన్నీ వడ్డించిన పదార్థాలు వడ్డించినట్లే వున్నాయి. కొన్ని పుస్తకాలు చదివి పడేసినట్టూ, కొన్ని చిందర వందరగా పడేసినట్టూ, కొన్ని చింపేసి గుట్టలు గుట్టలుగా పోసినట్టూ వున్నాయి. ఆ ప్లేట్లలోంచి, ఆ పుస్తకాలలోంచి అందరి కళ్ళూ హంతకుడు మహీధర్ గురించే వెతుకుతున్నాయి. ఎక్కడా కనిపించడంలేదు. మంచం మీదా బ్లాంకెట్ కిందా, బాత్‌రూంలో అంతా వెతికారు. పుస్తకాలన్నీ మీద కప్పుకుని మంచంకింద కనిపించాడు మహీధర్! అందరి దృష్టీ ఒక్కసారిగా అటుతిరిగింది.

"మిస్టర్ మహీధర్! ప్లీజ్ కమ్ అవుట్" పిలిచాడు జస్టిస్ చౌదరీ.'

అతడు రాలేదు. వేరేవాళ్లు పిలిచారు. అతడురాలేదు. కోర్టులోని న్యాయవాదులందరూ పిటిచారు. అంతడు కదల్లేదు.

ప్రెస్‌వాళ్లు పిలిచారు. అతడు పలకలేదు.

మనిషి బతికున్నాడా లేదా అని కదిలించి చూశారు కొందరు. కదిలాడు. మెల్లగా మంచంకింద నుంచి బయటికి లాగారు.

"మహీధర్.. మహీ..." వాళ్ల తల్లితండ్రులు పిలిచారు.

"హల్లో మహీధర్.. బంధువులూ స్నేహితులూ పిలిచారు. సమాధానం లేదు. అందరివైపు భయం భయంగా పిచ్చివాడిలా చూశాడు. భుజంమీద చెయ్యేసి పలకరించబోయింది. తల్లి. "వే..వే..వే.." అంటూ జంతువుల్లా అటూ ఇటూ తిరగడం మొదలెట్టాడు.

మహీధర్ మనుషుల్ని మర్చిపోయాడు. మాటలు మర్చిపోయాడు. అసలుమెదడునే కోల్పోయాడు.

ఎటు చూసినా కుళ్ళువాసన క్షీరసాగర మథనంలో పెల్లుబికిన విషవాయువులా అల్లుకుపోయింది.

అన్నంప్లేట్ల మీద కులాసాగా పాకుతూన్న చీమలు, సంతోషంగా తిరుగుతూన్న ఈగలూ! అక్కడ ఎవ్వరూ క్షణం కూడా వుండలేక బయటికొచ్చేస్తున్నారు. రోజా అతనికిచ్చిన బట్టలు కూడా కొన్నేళ్లే వేసుకున్నట్టున్నాడు. మిగిలినవన్నీ ఒకవైపు దొంతరగా అలాగే పడున్నాయ్. మరోవైపు విప్పిన బట్టల కుప్ప..

మహీధర్‌ని చేతులు పట్టుకుని లాగి, ఎత్తుకుని తీసుకెళ్లి, కార్లో కూర్చోబెట్టారు. పోలీసువాళ్లు.

జస్టిస్ సహానీ. జస్టిస్ చౌదరి వైపు చూశాడు.

"భలే తీర్పు! ఉరితీస్తే క్షణంలో చచ్చుండేవాడు. భార్యని కూరలు కోసినట్టు ముక్కలు ముక్కలుగా కోసిన ఈ కిరాతకుడికి ఉరిశిక్ష చాలా సుఖమైనచావు. ఇటువంటి క్రూరులకు వారి క్రూరమైన మెదడుని చంపాలి. జస్టిస్ సహానీ అదేచేశాడు." అన్నారు.

"మనిషి సంఘజీవి. ఎవ్వర్నీ కలవకుండా, ఎవ్వరితోటీ ఒక్కమాటైనా మాట్లాడకుండా ఏళ్లతరబడి గోడలు, తలుపులు చూసుకుంటూ కూర్చుంటే, తిండే సయించదు. ఎంత దుర్మార్గుడైనా దుర్మార్గాన్ని తలబెట్టే ముందు, వందసార్లు ఆలోచిస్తాడు." అన్నారు కొందరు.

"అందుకే పూర్వకాలంలో చేతులు నరికెయ్యడం, కళ్లు పీకెయ్యడం లేదా ఎక్కడో దీవులకు పంపెయ్యడం వంటి శిక్షలుండాలి. అవి తీసేశాక మనిషికి ఇటువంటి క్రూరత్వం పెరిగిపోయింది. శిక్ష భయంలేదు గనుక" అన్నారు కొందరు.

అన్ని పేపర్లూ మర్నాడు జస్టిస్ సహానీ గురించి అద్భుతంగా రాశాయి. జస్టిస్ సహానీ ఫోటో ఒకవైపు, శిక్షకు ముందు మహీధర్ పోటో, శిక్షతరువాత మహీధర్ ఫోటో. ఎక్కడ చూసినా ఇదే గోష్ఠి!

జస్టిస్ చౌదరి జస్టిస్ సహానీకి సమర్పించిన ప్రత్యేక ప్రశంసాపత్రం సారాంశం కూడా అన్ని మీడియాలలోనూ వచ్చింది.

మహిళలందరూ జస్టిస్ సహానీకి అభినందనలు అందజేశారు. ఏనోట విన్నా ఒకేమాట 'భలేతీర్పు'! అని. జస్టిస్ సహానీ పదేళ్ల తరవాత మళ్లీ హైకోర్టు ఆవరణలో అడుగుపెట్టాడు జై జై నినాదాల మధ్య!

* * *